క్లుప్తంగా

నేటినుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాలిసెట్–2023 కౌన్సెలింగ్ నేటి(శనివారం) నుంచి ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ శ్యాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18 వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించడం జరుగుతుందని ఉత్తీర్ణులైన విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్ వచ్చిన స్లాట్ తేదీ ప్రకారం హాజరుకావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

మహాముత్తారం: మండలంలోని కనుకునూర్ పెగడపల్లి మధ్య ప్రధాన రహదారిలో కారు బైక్ ఢీకొట్టిన సంఘటనలో శుక్రవారం ఒకరికి గాయాలయ్యాయి. అదేవిధంగా మండలంలోని సింగారం నుంచి మేడారం వెళ్లే ప్రధాన రహదారిలోని మూల మలుపు వద్ద ఎదురు ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఒక దానికి ఒకటి ఢీకొట్టడంతో పలిమెల మండలానికి చెందిన మూతి కిష్టయ్య కాలు విరిగి మరోఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సింగారం దగ్గర జరిగిన సంఘటనలో మూతి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేసు నమోదు

ములుగు: ములుగు మండలం బండారుపల్లి సమీపంలోని భద్రాద్రికొత్తగుడెం జిల్లా మణుగూరుకు చెందిన ముసికె సుధాకర్ సొంత భూమిలో ఏర్పాటు చేసిన ప్రహారిని ధ్వంసం చేసిన వారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సుధాకర్ 20 సంవత్సరాల క్రితం ములుగు పట్టణానికి చెందిన ఖలీల్ నుంచి 27 గుంటల భూమిని కొనుగోలు చేశారు. తన భూమి పక్కన రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పడడంతో ముందు జాగ్రత్తగా ప్రహారి వేసుకున్నారు. ఇటీవల ప్రహారిని అకారణంగా ధ్వంసం చేశారని సుధాకర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై లక్ష్మారెడ్డి సందర్శన స్థలాన్ని పరిశీలించి ఫిర్యాదులో పేర్కొన్న ఎండీ అఫ్జల్, జాని, మొహినుద్దీన్, షకీల్ అహ్మద్, జమీల్, సలీమ్, రిజ్వాన్, ఇమ్రాన్, రహీం, ఎండీ ఇమ్రాన్, అబ్దుల్ ఖలీల్‌లపై సెక్షన్ 447, 427 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసు..

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. దీంతో తల్లి గుగులోత్ మానిక్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కూతురును అదే గ్రామానికి చెందిన సాయిరాం కిడ్నాప్ చేసి తీసుకువెళ్లినట్లు అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. మానిక్యం ఫిర్యాదు మేరకు సాయిరాంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో తాగునీటి తిప్పలు

మంగపేట: మండలంలోని రాజుపేట పంచాయతీ పరిధిలోని దేవనగరం ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారు. పాఠశాలలో బోరుబావిని ఏర్పాటు చేసిన మోటారు కాలిపోయింది. దీంతో పాఠశాలలో తాగు నీరు లేక విద్యార్థులు ఇంటి నుంచి బాటిళ్లతో నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు నీళ్లు లేక పోవడంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో గార్డెన్ కోసం పెంచిన మొక్కలు, కూరగాయల చెట్లు సైతం నీరు లేక ఎండిపోతున్నాయని పాఠశాల పాధ్యాయులు మంకిడి బుచ్చయ్య తెలిపారు. తాగునీటి బోరుబావి మోటారుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించామని చెబుతు ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో గొప్పలు చెపుతున్న అధికారులు పాఠశాలలో నెలకొన్న సమస్యపై సమాధానం చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ధనలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటాం..

ఏటూరునాగారం: విద్యుత్ షాక్‌తో ఇటీవల మృతి చెందిన కొండాయి ఎంపీటీసీ మల్లెల ధనలక్ష్మి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొండాయిలో మల్లెల ధనలక్ష్మి కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కూనూరు మహేష్ గౌడ్, ఎంపీపీ అంతటి విజయనాగరాజు, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, ఎంపీటీసీలు కోట నరసింహులు, అలి సుమలత, శ్రీనివాస్, కుమ్మరి స్వప్న చంద్రబాబు, మండల కో ఆప్షన్ ఎండీ ఖలీల్, పాయం రాకేష్, మాదరి రాంబాబు, మాచర్ల శ్రీనివాస్, పాడెంశోభన్ పాల్గొన్నారు.

మేమూ పౌరులమే!

పట్టాల్లేవు.. ఇళ్ల స్థలాలు రావు
- సంక్షేమ పథకాలు అందనే అందవు..
- కనీసం మనుమల్లా చూడని ప్రభుత్వాలు
- అంతుచిక్కని చెంచు గిరిజనుల ఆవేదన!

సమాజానికి, సంక్షేమానికి దూరంగా.. అడవి చెంతన సమస్యల నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికీ సంక్షేమ పథకాలంటే వాళ్లకు తెలియదు. 'మేమూ పౌరులమే.. మేమూ తెలంగాణోళ్లమే మరి మమ్మల్నెందుకు ఈ ప్రభుత్వం కనీసం మనుషుల్లా చూడట్లేదు' అని చిట్యాల మండలం బావుసింగ్‌పల్లి, లక్ష్మీపూర్‌తండా గ్రామాల చెంచు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి ఆవేదనకు అక్షర రూపం ఇస్తూ..

\- చిట్యాల


కలెక్టర్‌కు మొరపెట్టుకుంటున్న బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన చెంచులు (ఫైల్)

మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామంలో 23 చెంచుల కుటుంబాలు ఉన్నాయి. వారు పూర్వకాలం నుంచి సర్వే నంబర్ 405, 406, 577లో ఉన్న భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. సాగులో ఉన్న ఇప్పటి వరకు తమకు ఏలాంటి అధికారికంగా పట్టాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ రాతలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాలు ఇవ్వకపోడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత మండల అధికారులను కలిసిన ఫలితం దక్కడం లేదని, తహసీల్దార్లను కలిసి సమస్యపై విన్నవించుకున్న కనీసం వారు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి సోమవారం జరిగే గ్రీవేన్స్‌సెల్‌లో గత సంవత్సరం నవంబర్‌లో కలెక్టర్ భవేష్‌మిశ్రాను కలిసి తమ సమస్యలను చెప్పినట్లు తెలిపారు. దీంతో స్పందించిన కలెక్టర్ అప్పటి తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చి 15 రోజుల్లో ఒక నివేదికను తయారు చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కాని నేటికి సమస్య అలాగే ఉందన్నారు. ఈ విషయంపై పలమార్లు సర్పంచ్ దామెరబొయిన నారాయణరావు సంబంధిత కార్యాలయ చూట్టు అలాగే మండల సర్వసభ్య సమావేశాలలో సభ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు కనీసం కనికరం చూపకపోవడం లేదని వాపోయారు.

లక్ష్మీపూర్‌తండాలో..

మండలంలోని లక్ష్మీపూర్‌తండా గ్రామంలో 20 చెంచు గిరిజన కుటుంబాలు ఉన్నాయి. 15 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం చెంచులకు ఇంటి స్థలాలతో పాటు పట్టాలు ఇచ్చారు. కాని పట్టాలు ఉన్న ఇంటి స్థలం ఎక్కడో ఉందో తెలియని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం స్థానిక సర్పంచ్ జవహర్‌లాల్ నాలుగు సంవత్సరాల నుంచి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కనీసం సంబంధిత అధికారులు పట్టింపులేనట్లు వ్యవహరిస్తు చోద్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చెంచు గిరిజనల సమస్యలను పరిష్కరించి వారికి ఇంటి స్థలాలను చూపించి హద్దులను కేటాయించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని జిల్లా అధికారులను ఆయన కోరారు.

పట్టాలు ఇచ్చి ఆదుకోవాలి..



చెంచు కుటుంబాలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చి ఆదుకోవాలి. పూర్వ కాలం నుంచి వారు భూమిని సాగు చేసుకుని పంటలు పండించుకుంటున్నారు. వారికి పట్టాలు ఇచ్చేందుకు కృషి చేయాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన స్పందిచండ లేదు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి చెంచులకు పట్టాలు అందించాలి.

\- డి.నారాయణరావు, సర్పంచ్, బావుసింగ్‌పల్లి

చిన్న చూపు చూస్తున్నారు..



చెంచు గిరిజనలను అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. కొంత కాలం క్రితం అప్పటి ప్రభుత్వం ఇంటి స్థలాలతో పాటు పట్టాలు ఇచ్చారు. కాని ఇంటి స్థలాలకు హద్దులు కేటాయించలేదు. సంబంధిత అధికారులకు ఎంత విన్న వించుకున్న ఫలితం లేదు. నేను సర్పంచ్ అయినప్పటి నుంచి మండల సర్వసభ్య సమావేశంలో సభ దృష్టికి తీసుకెళ్లిన ఎవరూ పట్టించుకోవడం లేదు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. చెంచు గిరిజనలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

\- జవహర్‌లాల్, సర్పంచ్, లక్ష్మీపూర్ తండా

పల్లె ప్రకృతి వనంలో మంటలు


ప్రకృతి వనంలోకి వ్యాపిస్తున్న మంటలు

చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామ శివారులో ఉన్న మెగా బృహత్ పల్లె ప్రకృతి వనంలో శుక్రవారం మంటలు వ్యాపించాయి. గుర్తు తెలియని వ్యక్తులు మంటలు పెట్టడంతో గాలికి బృహత్ పల్లె ప్రకృతి వనంలోకి వచ్చాయి. విధుల నిమిత్తం జడల్‌పేట వైపు వెళ్ళుతున్న ఎపీఓ హలీం పాషా, టీఏ అపర్ణ చూసి సర్పంచ్‌కి సమాచారం అందించడంతో సిబ్బంది జీపీ ట్రాక్టర్ ట్యాంకర్‌తో మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు అందులోని మొక్కలు కొంతమేర దెబ్బతిన్నాయి. అధికారులు చూడకపోతే పెద్ద మొత్తంలో మొక్కలు దెబ్బతినేవని స్థానికులు పేర్కొన్నారు. అధికారులను, పంచాయతీ సిబ్బందిని ఎంపీడీఓ అభినందించారు.

బిల్లులు విడుదల చేయాలి

కన్నాయిగూడెం: పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు విడుదల చేయాలని చింతగూడెం పాఠశాల చైర్మన్ సునార్కని రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాలీచాలని కూలితో విద్యార్థులకు భోజనం పెడుతున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

మహదేవపూర్: మండలానికి చెందిన పలువురి లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు శుక్రవారం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన సుశీలకు రూ.8,500 కుదురుపల్లి గ్రామానికి చెందిన కిష్టయ్యకు రూ.20,000 పోసమ్మకు రూ.16,000ల విలువగల చెక్కులు మంజూరుకాగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు జక్కు రాకేష్, కాళేశ్వరం దేవస్థాన చైర్మన్ శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీపతి బాపు, గీతబాయి, మనోహర్, ప్రకాష్, తిరుపతిరెడ్డి, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే


సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర గ్రామంలో శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ వైద్య సిబ్బందితో కలిసి ఎదిర గ్రామంలో తిరుగుతూ ఇంట్లో ఎంత మంది ఉంటున్నారు, వారిలో జ్వరాలబారిన పడి ఇబ్బందులు పడుతున్నారా అనే విషయాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది యాకలక్ష్మి, రామలక్ష్మి, రామకృష్ణ ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

టేకుమట్ల: సామాజిక ఉద్యమ, సినీ గేయ రచయిత మిట్టపెల్లి సురేందర్ రచించిన 'తల్లీ నా వెలిశాల నీకున్నది చరిత్ర చాలా' అనే పాటకు 20 సంవత్సరాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఈ నెల 25న మండలంలోని వెలిశాలలో నిర్వహించే సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే వెలిశాలకు ప్రత్యేకత ఉందని, వెలిశాల నాటి స్థితిగతులను పాట రూపంలో ఆవిష్కరించి, ఉద్యమ చరిత్రను నలుదిశగా చాటిన అభ్యుదయ గేయ రచయిత మిట్టపెల్లి సురేందర్ ప్రజల మనస్సులో నిలిచియారాన్నారు. మా ఊరు చరిత్రను రాష్ట్ర వ్యాప్తంగా తెలిపిన సురేందర్‌కు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గీత రచయిత మిట్టపెల్లి సురేందర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పొలాల సరోత్తంరెడ్డి, అడగాని రామారావు, గునిగంటి మహేందర్, బిల్లకంటి ఉమేందర్ రావు, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, గందం సారయ్య, ఏనుగు లచ్చిరెడ్డి, నేరేళ్ల శ్రీనివాస్, నందికొండ మహిపాల్‌రెడ్డి, కాసగాని మొండయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండీ అఫ్జల్, మిట్టపెల్లి మిత్రమండలీ అందె కుమార్, పాల శంకర్, పుల్ల సతీష్, కిరణ్, దప్పు సత్తి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు


గొత్తికోయలతో మాట్లాడుతున్న సీఐ కిరణ్

పలిమెల: మావోయిస్టులకు సహకరించవద్దని మహదేవ్‌పూర్ సీఐ కిరణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం మండలంలోని ముకునూర్ గొత్తికోయగూడెంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ కిరణ్ గొత్తికోయలతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే మావోయిస్టులకు సహకరించడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని ఇందుకు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మావోయిస్టుల గురించి ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు సమాచారం అందించాలన్నారు. గూడెంలోకి అనుమానితులు, కొత్త వ్యక్తులు ఎవరు వచ్చిన పోలీసులకు తెలుపలన్నారు. బడి ఈడు పిల్లలను తప్పకుండా స్కూళ్లకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పలిమెల ఎస్సై అరుణ్, సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రం అందిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన తక్కెళ్లపల్లి సుమన్‌రావును బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రం అందజేశారు. బీజేపీ బలోపేతం కోసం అహర్నిషలు కృషిచేసినందున ఆయన సేవలను గుర్తించి సుమన్‌రావుకు నియమాకపత్రాన్ని అందజేసినట్లు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, మండల పార్టీ అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మంపల్లి వంతెన ప్రారంభం

- హాజరుకానున్న మంత్రులు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంతెన

మల్హర్: మల్హర్ మండలం తాడిచర్ల–పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి మానేరుపై నిర్మించిన రెండు జిల్లాల వంతెన నేడు(శనివారం) ప్రారంభం కానుంది. వంతెనను ప్రారంభించడానికి మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీచైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి హాజరుకాన్నురు. ఉదయం 10 గంటలకు వంతెను ప్రారంభించినున్నట్లు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు వెల్లడించారు. 2014 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో వంతెన నిర్మాణానికి రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. 2017 సంవత్సరం ఆగస్టున 1న వంతెన పనులకు అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపాన చేసిన పనులు ప్రారంభించారు. 5 సంవత్సరాలు కాలం పాటు సాగిన పనులు 2022 సంవత్సరం చివరిల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకవచ్చారు.

రక్షణ చర్యలు కరువు

మల్హర్: మండలంలోని తాడిచర్ల మానేరుపై ఏర్పాటు చేసిన ఖమ్మంపల్లి మానేరుపై రక్షణ చర్యలు లేకుండా వంతెనను ఎలా ప్రారంభిస్తారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వంతెనకు తాడిచర్ల వైపు కనెక్టింగ్ రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదని తెలిపారు. అలాగే బ్రిడ్జి ఎక్కే దగ్గర అప్రోచ్ రోడ్డుకు రెండు వైపుల సైడ్ రైలింగ్ పెట్టలేదని, విద్యుత్ దీపాలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదన్నారు. ఏమైనా ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవిస్తే ఎవరు భాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం


అవగాహన కల్పిస్తున్న రాధిక

మల్హర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక అన్నారు. మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలో సర్పంచ్ విజయ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక శుక్రవారం అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు చేర్పించాలని సూచించారు. కేంద్రంలో పిల్లలకు సిలబస్ ప్రకారం ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహించి పాఠాలు నేర్పించడం జరుగుతుందని వెల్లడించారు. శారీరక అభివృద్ధి కోసం పిల్లలకు ప్రతి రోజు గుడ్డు, ఆకు కూరలతో భోజనం పెట్టి పిల్లలకు బరువులు తీసి వారి పోషణ స్థాయిని తల్లిలకు తెలియజేయడం జరుగుతుందని వివరించారు. అనంతరం ఆరు నెలలు దాటిన పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, సౌజన్య, రమాదేవి, రజిత, భారతమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

ఆదివాసీలను పట్టించుకోని ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

వెంకటాపురం(కె): ఆదివాసీలకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఆదివాసీ నవ నిర్మాణ సేన మండల ప్రధాన కార్యదర్శి కుంజా మహేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జిల్లా కాలనీలో ఆదివాసీ నవ నిర్మాణ సేన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదివాసీలకు ఏం మేలు చేశారని తెలంగాణ ఉత్సవాలు జరుపుకోవాలని అన్నారు. ఓట్ల కోసం 11 గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో కలిపారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ సమస్యలను ప్రభుత్వం పట్టిచుకోలేదని అన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి పంచాయతీ పరిధి కొడిశలకుంట గ్రామానికి చెందిన పోరిక కవిత కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంది. దీంతో బాధిత కుటుంబాన్ని ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శుక్రవారం పరామర్శించి కవిత మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవిత ఇద్దరి పిల్లల చదువులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట సర్వర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం)లో..

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన జానపట్ల కొమురక్క శుక్రవారం ఉదయం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని డీసీసీబీ డైరెక్టర్ మాడుగుల రమేష్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, నాయకులు మల్క రమేష్, కూరెళ్ల రామాచారి, బుర్ర సమ్మయ్యలు పరామర్శించారు.

వర్గీకరణపై పోరాటానికి సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న సామ్యెల్

మల్హర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై జూలైలో నిర్వహించే పోరాటానికి మదిగ, మాదిగ ఉపకులాలు, సామాజిక ఉద్యమ శ్రేణులు సిద్ధం కావాలని ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకుడు, మంథని నియోజకవర్గ పర్యవేక్షకుడు మంథని సామ్యెల్ పిలుపునిచ్చారు. మండలంలోని కొయ్యూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం, మోసం కారణంగా ఎస్సీ రిజర్వేషన్ల చట్టబద్ధతకు నోచుకోలేదని ఆరోపించారు. సామాజిక ఉద్యమ నేత మంద కృష్ణ నాయకత్వంలో జూలైలో నిర్వహించే వర్గీకణ పోరాటని సిద్ధం కావాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధికారి రాజయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నరేష్, ముత్తయ్య, రమేష్, సురేష్, సమ్మయ్య, శ్రీకాంత్, అర్జున్ పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


రమేష్‌చంద్ర గుప్త(ఫైల్)

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం అంతరాష్ట్ర వంతెన సమీపంలో మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పెంగిడిగూడ గ్రామానికి చెందిన క్రిష్ణపురం రమేష్‌చంద్ర గుప్త(68) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్‌చంద్ర గుప్త పెంగిడిగూడలో స్వంతంగా కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తూ.. ఆర్థికంగా నష్టపోయాడు. ఈక్రమంలో ఈనెల 13న ఇంటి నుంచి బయలుదేరి మొబైల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. 16న మధ్యాహ్నం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ నుంచి అందిన సమాచారంతో కుటుంబ సభ్యులు వచ్చి, మృతదేహాన్ని గుర్తించారు. కాగా, మృతిపై ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వెంకటకృష్ణ

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీ గోవిందరావుపేట మండలం మండల అధ్యక్షుడిగా పాలడుగు వెంకటకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ నియమకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ.. మండలంలోని పార్టీ బలోపేతానికి పాటుపడుతానని అన్నారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సుధాకర్, కొమురం ధనలక్ష్మీ, ఎల్లారెడ్డి ఉన్నారు.